అంతర్వేదిలో పండిత సదస్యం

రేపు చక్రస్నానం

- 7లో







కె.పెదపూడి, మాచవరం గ్రామాల్లో ఎండిపోయిన పంటపొలాలు.. ఇసుకపూడిలో తుప్పలతో నిండిపోయిన పంటబోదె

నోళ్లు తెరుస్తున్న వరిచేలు!

- అన్నదాతలకు సాగునీటి కష్టాలు
- వంతులవారీ విధానంతో ఆందోళన
- బీటలు వారుతున్న పంటచేలు

అంబాజీపేట, ఫిబ్రవరి 22: ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టపోయిన రైతులు కొంతమేర లాభాలను సాధించుకొనేందుకు చేపడుతున్న రబీ సాగుకు ఆది నుంచి ఆటంకాలు ఎదురవుతూనే ఉన్నాయి. పంటపొలాలు నీటిఎద్దడి కారణంగా బీటలు వారుతున్నాయి. అంబాజీపేట మండలంలో 3,040 ఎకరాల్లో రైతులు రబీసాగును చేపడుతున్నారు. నారుపోసినప్పటి నుంచి వంతుల వారీ విధానంతో పంటపొలాలకు నీరు అందకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సాగునీరు అందిస్తామని హామీ ఇస్తున్నప్పటికీ అవి నోటిమాటలగానే మిగిలిపోతున్నాయి. పొలాలు వివిధ దశలో ఉండగా నీరు అందకపోవడంతో భూమి బీటలు వారి వరిచేలు దెబ్బతినే స్థితికి చేరుకుంటున్నాయి. పంటలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటను కాపాడుకొనేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సాగునీరు అందకపోవడంతో మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటబోదెల ద్వారా శివారు ప్రాంతాల్లోని పంటచేలకు సాగునీరు అందించాల్సి ఉండగా ఇరిగేషన్ అధికారులు వంతుల వారీ విధానం అని చెప్పి చేతులు దులుపుకుంటున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పంట బోదెలు తుప్పలు, చెత్తాచెదారంతో నిండిపోయినప్పటికీ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ముక్కామల లాకులపైనా కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, కొత్తపాలెంలో ఉన్న సుమారు 1000 ఎకరాలకుపైబడి ఆయకట్టుకు నీరు అందించాల్సి ఉంది. అయితే నారుపోసినప్పటి నుంచి పంట చివరి దశ వరకూ ఒక చుక్క నీరు కూడా ఈ ఏడాది పంటచేలకు అందించలేదని, కేవలం బోర్లపైనే ఆధారపడి వ్యవసాయం చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరోపక్క విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో ఆయిల్ ఇంజన్లపై పంట పొలాలకు నీరు పెట్టుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. నారుమడులు వేసినప్పటి నుంచి ఆయిల్ ఇంజన్‌లపైనే నీరు పంటపొలాలకు పెట్టామని వారు తెలిపారు. ఇక గోపాలపురం పరిధిలోని చిరతపూడి, ఇసుకపూడి గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారు. చిరతపూడి నుండి ఇసుకపూడి వరకూ పంట బోదెలు చెత్తచెందారం, జలగడ్డితో నిండిపోయింది. దీంతో ఆయా ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించి అన్నదాతలను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఒక్క తడికైనా నీరు అందించాలి...

సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి. ఒక తడికైనా సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను కోరుతున్నాం. నీటి ఇంజన్ల ద్వారా నీరు పెట్టుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. డీజల్‌కు పెట్టుబడులు పెట్టలేక ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నాం.

- మట్టపర్తి చిన్నయ్యశెట్టి, గంగలకుర్రు అగ్రహారం

11 రోజులకోసారి సాగునీరు విడుదల

ముక్కామల లాకుల పరిధిలో వంతుల వారీ విధానంతో 11 రోజులకు ఒకసారి సాగునీరు అందిస్తున్నాం. పంటబోదెలను ఇరిగేషన్ సిబ్బందితో శుభ్రం చేయించి సాగునీరు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. నీటిలభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీరు అందిస్తున్నాం.

- నవీన్‌కుమార్, ఇరిగేషన్ జెఈ, ముక్కామల

బీటలు వారిన వరిచేలు.. రైతుల ఆందోళన

మామిడికుదురు, ఫిబ్రవరి 22: నగరం గ్రామంలో తాగునీరు అందక చేలు బీటలు తీస్తున్నాయని రైతులు గురువారం ఆందోళన బాట పట్టారు. నగరం గ్రామంలోని గుర్రాల చెరువు ప్రాంతంలో సాగునీరు అందక పొలాలు బీటలు తీసి ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వంతులవారీగా సాగునీరు అందిస్తున్నామని చెప్పారుగానీ అది అమలుకు నోచుకోవడం లేదన్నారు. సుమారు 200 ఎకరాల వరి పొలాలు బీటలు తీసి ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి మండి పొట్ట దశలో ఉందని, ఈ దశలో సాగునీరు అవసరమని, ఇప్పటివరకు ఎకరానికి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టామని ఆందోళన వ్యక్తంచేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతులు కడలి సత్యనారాయణ, తాటికాయల ఉదయభాస్కరరావు, విత్తనాల సూర్యకాంతం, కూనా నరసింహారావు, బొంతు భాస్కరరావు, మీర్ జుల్ఫికర్ అలీ పాల్గొన్నారు.



నగరం గ్రామంలో బీటలు తీసిన వరిచేల వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు

గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గోపాలమిత్రలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: పశు సంవర్ధకశాఖలో 24 ఏళ్లగా పనిచేస్తున్న గోపాలమిత్రల సమస్యలను పరిష్కరించాలని డిమాండుచేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గోపాలమిత్ర సర్వీసు అసోసియేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అమలాపురం కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం అమలు చేయడంలేదని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం.రత్నరాజు పేర్కొన్నారు. 2019-23 వరకు గోపాలమిత్రలకు రావాల్సిన ఏఐ ఇన్సెంటీవ్‌లను వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. సీఐటీయూ నాయకుడు నూకల బలరామ్, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, మెడికల్ బిల్లులు చెల్లించాలని, చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించాలని, గోపాలమిత్రలకు ఒకేవిధంగా విధులు ఉండేలా చూడాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకులు వై.శ్రీనివాసరావు, యు.గోవిందు, ఎన్.ప్రకాశరావు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు తదితరులు

వైసీపీకి షాక్!

- సొసైటీ అధ్యక్షులు, నామినేటెడ్ పదవుల్లోని నేతల రాజీనామా
- లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు

అంబాజీపేట, ఫిబ్రవరి22: వైసీపీ అభ్యర్థుల విజయాల కోసం 14 ఏళ్ల నుంచి కష్టపడి చేశాం.. కష్టించి పనిచేసిన నాయకులకు పార్టీలో సరైన గుర్తింపు ఉండడం లేదని, దీంతో మనస్తాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వైసీపీ మండలస్థాయి నేత వాసంశెట్టి సుబ్రహ్మణ్యేశ్వరరావు(చినబాబు), సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, వాసంశెట్టి రాంబాబులు తెలిపారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో వైసీపీ అసమ్మతి నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు టిక్కెట్టు ఇవ్వకపోతే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించానని, చిట్టిబాబుకు ఎమ్మెల్యే టిక్కెట్టు కేటాయించకుండా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా విప్పర్తి వేణుగోపాలరావును అధిష్టానం నిర్ణయించిందన్నారు. దీంతో ఈనెల 6న ముక్కామలలో పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశానని తెలిపారు. తనతోపాటు గంగలకుర్రు, ముక్కామల సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాంబాబు, మాచవరం దేవస్థానం చైర్మన్ చప్పిడి సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల పండుతోపాటు పార్టీలో ఉన్న బీసీ నాయకులు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం మండల టీడీపీ శ్రేణులు మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ, మట్టపర్తి సతీష్, మట్టపర్తి చినవెంకటేశ్వరరావు, మంద నాగరాజు తదితరులు చినబాబుతోపాటు నాయకులతో భేటీ అయ్యారు. వీరంతా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశంలో నాయకులు మట్టపర్తి జలంధర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారిణి నాగశిరీష

ప్రధానమంత్రి జన్మాన్ అమలుకు జిల్లా ఎంపిక

అమలాపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు తెగల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి జన్మాన్ అమలుకు రెండో దశలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంపికైనట్టు జిల్లా గిరిజన సంక్షేమాధికారిణి నాగశిరీష పేర్కొన్నారు. షెడ్యూల్డు తెగల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి మూడేళ్లపాటు లక్షిత వర్గాల సంక్షేమానికి అమలు చేయాల్సి ఉందన్నారు. అణగారిన కొండ రెడ్లు, చెంచుల అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రధానమంత్రి జన్మాన్ పథకం అమలు తీరుపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద గృహనిర్మాణ సంస్థ ఆయా వర్గాలకు గృహాలు నిర్మించాలన్నారు. ఆయా తండాలకు రహదారులను పంచాయతీరాజ్ ఇంజనీర్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 72,297 మంది గిరిజనవర్గాలవారు ఉండగా వారిలో అణగారిన వర్గాలకు చెందినవారు 560 మంది ఉన్నారన్నారు. ఐసీడీఎస్ పీడీ ఎంఝాన్సీరాణి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, బీఎస్‌వో ఎ.పాపారావు, ఎల్డీఎం కె.శ్యామ్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎల్డీవో శాంతి పాల్గొన్నారు.



'జర్నలిస్టుల స్వేచ్ఛను హరిస్తూ దాడులు చేయడం అమానుషం'

రామచంద్రపురం, ఫిబ్రవరి 22 : ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న జర్నలిస్టుల పత్రికా స్వాతంత్ర్యాన్ని హరిస్తూ కొంతమంది గూండాల్లా ప్రవర్తిస్తూ అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్ సిద్ధం సభ జరుగుతుండగా ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడులు చేయడం అమానుష చర్య అని రామచంద్రపురం నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు నాయకులు అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై, ఈనాడు కార్యాలయంపై దాడులు చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు రాజ్యాంగం ద్వారా కల్పించిందని, దాన్ని కాలరాసే అధికారం ఎవరికీ లేదన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కనికెళ్ల కనకరత్నం, కార్యదర్శి గంపల పృథ్వీరాజు, గుబ్బల రాంబాబు, సాయిరాం, కె.భద్రరావు, కొప్పిశెట్టి రాము, కుడుపూడి రమేష్, దేవ గణేశ్వరరావు, గవర వెంకటరమణ, దేవు మహేశ్వరరావు, నరాల త్రిమూర్తులు, ఏపీయూడబ్ల్యూజే నేతలు బోడపాటి ప్రసాద్, యార్లగడ్డ ప్రసాద్, వెంటపల్లి భీమశంకరం పాల్గొన్నారు.

ఎవరు.. ఎక్కడో..



- అభ్యర్థుల ఎంపికల్లో ఎనలేని జాప్యం
- ప్రధాన రాజకీయ పార్టీల్లో గందరగోళం
- ఉత్కంఠకు గురవుతున్న రాజకీయ పార్టీల కేడర్
- టీడీపీ ఒక స్థానంలో అభ్యర్థి ప్రకటన
- వైసీపీ రెండు స్థానాల్లో కొత్త ఇన్‌చార్జిలు
- మిగిలిన స్థానాల్లో అభ్యర్థులకు రాని గ్రీన్ సిగ్నల్
- టెన్షన్‌లో సిటింగ్ ఎమ్మెల్యేలు, ఆశావహులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీచేసే తమ అభ్యర్థులను ప్రకటించడంలో చేస్తున్న జాప్యంతో ఆశావహుల్లో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. రాజకీయ పార్టీలు పొత్తులు, వ్యూహాత్మక ఎత్తుగడల కారణంగా అభ్యర్థుల ప్రకటన విషయంలో ఆచితూచి అడుగులేస్తున్నాయి. దీంతో ఆయా పార్టీలకు చెందిన కేడర్‌లో తీవ్రమైన గందరగోళం ఏర్పడింది. పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపిక చేసినప్పటికీ వారి పేర్లను మాత్రం అధికారింగా వెల్లడించకపోవడంతో జిల్లాలోని లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల్లోకి పార్టీ అభ్యర్థిగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పరోక్షంగా ఆ పార్టీలు చేపట్టే కార్యక్రమాల పేరుతో కొందరు ముందుకువెళ్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఏ కారణం చేతైనా సీటు రాకపోతే తమ భవిష్యత్తు ఏమిటనేది జిల్లాలోని వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల్లో నెలకొంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకుగాను టీడీపీ మండపేట నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పోటీ చేస్తారని ఇప్పటికే ప్రకటించింది. అదేవిధంగా జనసేన సిటింగ్ స్థానమైన రాజోలు నుంచి జనసేనే పోటీ చేస్తుందని ఆ పార్టీ ప్రకటించినప్పటికీ అభ్యర్థి ఎంపికలో స్పష్టత లేకపోవడం వల్ల గందరగోళ పరిస్థితి కేడర్‌లో నెలకొంది. రాజోలు జనసేన సీటు కోసం ఐఏఎస్ అధికారి వరప్రసాద్, డాక్టర్ రాపాక రమేష్‌బాబుతోపాటు ప్రస్తుత నాయకుడైన బొంతు రాజేశ్వరరావు పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ తెర వెనుక మాజీ మంత్రి కుమార్తెను రాజకీయ రంగ ప్రవేశం చేయించి జనసేన అభ్యర్థిత్వం తీసుకోవాలనే యోచనలో కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ విషయానికొస్తే ఇప్పటికే రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా పిల్లి సూర్యప్రకాష్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌ను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దాంతో వారిద్దరు నియోజకవర్గంలో ప్రజల్లోకి వెళుతున్నారు. ఇక కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల నుంచి సిటింగ్ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ సతీష్‌ల పేర్లను వైసీపీ అధిష్ఠానం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అలాగే అమలాపురం స్థానంలో మంత్రి పినిపే విశ్వరూప్ ఖరారు అవుతుందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ అధిష్ఠానం ప్రకటించలేదు. అటు మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు వైసీపీ సీటు ఖాయమని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా టీడీపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు అంశం ప్రతిష్ఠాత్మకంగా మారింది. జనసేనకు ఏడు స్థానాల్లో మూడు స్థానాలతోపాటు ఎంపీ స్థానం కూడా కావాలని ఆ పార్టీ అధిష్ఠానం కోరుతున్న నేపథ్యంలో జిల్లాలో పూర్తిగా ప్రతిష్ఠంభన నెలకొంది. రాజోలు జనసేన ప్రకటించినందున పి.గన్నవరం లేదా అమలాపురం స్థానాల్లో ఒకటి, రామచంద్రపురం స్థానాన్ని కూడా జనసేనకు కేటాయించాలని ఆ పార్టీ కోరుతున్నట్టు చెబుతున్నారు. అయితే పొత్తుల్లో భాగంగా బీజేపీకి కూడా సీట్లు కేటాయించాల్సి వస్తే ఏ స్థానాన్ని ఇరుపార్టీలు కలిసి బీజేపీకి కేటాయిస్తానేది ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేతలు రామచంద్రపురం నియోజకవర్గంపై దృష్టి సారించి ఎవరి లాబీయింగ్‌లు వారు చేస్తున్నారు. కొత్తపేట నుంచి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిరాజుల పేర్లు దాదాపు ఖరారు అయినట్టు ప్రచారంలో ఉన్నప్పటికీ వారి పేర్లను టీడీపీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించకపోవడంతో ఆ నియోజకవర్గాల్లో టీడీపీ కేడర్‌లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ రెండు స్థానాల్లోను జనసేన అభ్యర్థులు కూడా తమకే అవకాశం లభిస్తుందంటూ ప్రచారాస్త్రాలు సంధిస్తున్నారు. అయితే సీట్ల ఎంపిక విషయంలో అధిష్ఠానం సర్వేలకు ప్రాధాన్యం ఇస్తుండడంతో ఏ సర్వేలో ఎవరికి మొగ్గు ఉందో తెలియక అయోమయానికి గురవుతున్నారు. కొందరు ఆశావహులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలైతే ఒక అడుగు ముందుకువేసి పార్టీ ఆఫీసులో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పరోక్షంగా సర్వేలను సైతం ప్రభావితం చేసే వ్యూహాలను అమలుచేస్తున్నారంటూ జిల్లాలో మరోసారి ప్రచారం జరుగుతోంది.

గతానుభవాల దృష్ట్యా భద్రత పెంపు

- పబ్లిక్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్ హిమాన్షుశుక్లా



కాన్ఫరెన్సులో పాల్గొన్న డీఈవో కమలకుమారి తదితరులు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి22: మార్చి నెలలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ముందస్తు ఏర్పాట్లు పక్కాగా చేయడం జరిగిందని కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. గురువారం అమరావతి నుంచి పరీక్షల నిర్వహణా సన్నద్ధతపై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ సౌరభ్‌గౌడ్, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌లు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ శుక్లా పబ్లిక్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. గతంలో కొన్ని పరీక్షా కేంద్రాల వద్ద జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని భద్రతను మరింత పెంచామన్నారు. ఆయా కేంద్రాలను గుర్తించి మ్యాపింగ్ చేశామన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత అంశాలను పోలీసుశాఖ, స్క్వాడ్‌లను నియమించడం విద్యాశాఖ అధికారులు చేపట్టడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.సోమశేఖరరావు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పి.గోపాలకృష్ణ, ఎస్వీ మంగారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఇంజనీర్లు

ఇంజనీర్లపై విజిలెన్స్ కేసులు వెంటనే ఉపసంహరించాలి

తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయం ఎదుట నిరసన

అమలాపురంటౌన్, ఫిబ్రవరి22: గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ, ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లకు బిల్లులు చెల్లించకుండా విజిలెన్స్ విచారణలు చేసి ఇంజనీర్లను బలి పశువులను చేయడం దారుణమంటూ ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ జేఏసీ పిలుపు మేరకు అమలాపురంలోని పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈనెల 26 వరకు శాంతియుతంగా నిరసనలు చేపట్టి 28 నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్నం రాంబాబు మాట్లాడుతూ ఇంజనీర్లపై విజిలెన్సు కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. ఇంజనీర్లపై అసంబద్ధ టార్గెట్లు పెట్టి కలెక్టర్లు వేధించడం తగదన్నారు. గత 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రెండేళ్లుగా ఇంజనీర్లకు ట్రావెలింగ్ అలవెన్సులు సైతం చెల్లించడం లేదన్నారు. సచివాలయ భవన నిర్మాణాలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, కొత్తగా ఏర్పడిన జిల్లాలకు సూపరింటెండెంట్ ఇంజనీర్ పోస్టులు మంజూరు చేయాలని, సాంకేతిక పనులకు మాత్రమే ఇంజనీర్లు బాధ్యత వహించేలా జాబ్‌చార్టు ప్రకటించి ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన నిరసనలో జేఏసీ జిల్లాశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి భద్రరావుతోపాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.



పండిత సదస్యం

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని పురాతన కల్యాణ మండపం వద్ద గురువారం సాయంత్రం ఐదు గంటలకు నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు గావించి పండిత సదస్యం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వెంకటశాస్త్రి, అర్చకస్వాముల సారథ్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ స్వామి, అమ్మవార్లకు వేదాశీర్వచనం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి తన్మయత్వం పొందారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ప్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, పేరూరు వేద పండితులు పాల్గొన్నారు.



హనుమద్వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

వైభవంగా గ్రామోత్సవం

హనుమద్వాహనంపై ఊరేగిన స్వామి, అమ్మవారు

అంతర్వేది, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన గురువారం సాయంత్రం అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి వెంకట సత్యనారాయణరాజుచే నిర్మితమైన హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. తొలుత స్వామివారి వాహనశాల వద్ద నూతన వధూవరులైన స్వామి, అమ్మవార్లను వాహనంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వాహన నిర్మాతలు, అధికారులు, అర్చకులు, భక్తులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. రాత్రి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకస్వాముల ప్రత్యేక పూజల అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వాహన సేవను చూసి తరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ప్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ, వలవల రాంబాబు, ఎస్ఐ ఎస్.రాము, దాసరి వాసు, భక్తులు పాల్గొన్నారు.

వసంత మండపం ప్రారంభం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని చక్రస్నానం అనంతరం స్వామివారి తలార్చుకోవడానికి నూతన వసంత మండపాన్ని ఆలయ చైర్మన్, ప్యామిలీ ఫౌండర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్ ప్రారంభించారు. అంతకు ముందు పండితులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం జరగబోయే చక్రస్నానానికి ఈ వసంత మండపం వద్ద స్వామివారు ఆశీనులు కానున్నట్టు ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సఖినేటిపల్లి ఎస్ఐ ఎస్.రాము, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్‌లు ఒడుగు శ్రీను, కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, వాహనదారులు, భక్తులు పాల్గొన్నారు.

చక్రస్నానానికి ఏర్పాట్లు

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సముద్ర స్నానాల ఘట్టం వద్ద స్వామివారి చక్రస్నానానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. మాఘ మాసం శనివారం అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలకు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో బారికేడ్లు పెట్టి పూజలను భక్తులంతా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

భీమేశ్వరునికి సదస్యం



పండిత సత్కారం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సదస్యం ఘనంగా జరిగింది. కల్యాణమూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వర స్వామిలను వేదికపై అధిష్ఠింపజేశారు. తొలుత అర్చకస్వాములు స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలను పూశారు. అనంతరం గణపతి పూజ, అష్టదిక్పాలక ఆవాహన, ముక్కోటి దేవతా ఆవాహన చేశారు. అనంతరం వేదస్వస్తి, స్వస్తి ప్రవచనం జరిపారు. ఆగమ పండితులు, వేద పండితులు, స్వస్తివాచకులు, అర్చకస్వాములు, పురోహితులను నూతన వస్త్రాలతో ఈవో పీటీవీ సత్యనారాయణ సత్కరించారు. నీరాజన మంత్రపుష్పాలతో సదస్యం పూర్తయ్యింది. భక్తులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. అనంతరం సమస్త వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది.

వాడపల్లి వెంకన్న హుండీ ఆదాయం రూ.91.05 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం, ఫిబ్రవరి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, ఎం.రాధాకృష్ణ, బి.కిరణ్, నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. 29 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.69,95,492, అన్నప్రసాద హుండీల ద్వారా రూ21,09,881.. మొత్తం రూ.91,05,373 ఆదాయం లభించింది. బంగారం 57 గ్రాములు, వెండి 900 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతి రాజు కిశోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.1,55,674 లభించింది. లెక్కింపులో ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారి భాను, శనగన సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ఆలయ హుండీల ఆదాయం రూ.27.20 లక్షలు

అయినవిల్లి, ఫిబ్రవరి 22: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక స్వామి ఆలయ హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 56 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.26,22,100, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.98,061.. మొత్తం రూ.27.20 లక్షలు వచ్చిందని ఈవో ముదునూరి సత్యనారాయణరాజు చెప్పారు. 3.3 గ్రాముల బంగారం, 527 గ్రాముల వెండితో పాటు 21 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. పర్యవేక్షణాధికారిగా అమలాపురం తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ధర్మకర్తలు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముక్తేశ్వరం బ్రాంచి సిబ్బంది పాల్గొన్నారు.

వంజరాల వేటతో సందడి



ఉప్పాడ(కొత్తపల్లి) ఫిబ్రవరి 22: ఉప్పాడ తీరంలో వంజరం చేపల వేటతో సందడి నెలకొంది. గురువారం ఉప్పాడ తీరం నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులకు విరివిగా వంజరాలు దొరికాయి. గత రెండు రోజులు నుంచి తీరంలో మత్స్య సంపద దొరకడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీరంలో వంజరాల వేటతో సుమారు రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు సమాచారం.

విద్యార్థుల సమక్షంలో సరస్వతి పూజ

● రత్నగిరిపై ఘనంగా ఏర్పాట్లు ● పెన్నులు అందించిన ఈవో



సరస్వతి పూజ నిర్వహిస్తున్న పండితులు



పూజకు హాజరైన విద్యార్థులు

అన్నవరం, ఫిబ్రవరి 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం ఉచిత సామూహిక సరస్వతి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను, సరస్వతి దేవిని పండితులు ఆశీనులు గావించగా ఈవో రామచంద్రమోహన్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే అర్చక స్వాములు సత్యదేవుడు, సరస్వతీదేవిల అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించారు. అనంతరం సరస్వతీదేవి చెంత ఉంచిన కలములు, రక్షలను విద్యార్థులకు పండితులు మంత్రపూర్వకంగా అందించారు. పదో తరగతి, ఇంటర్ తదితర పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి ప్రతీఏటా దేవస్థానం తరుపున సామూహిక సరస్వతి పూజను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమం అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పూజలో పాల్గొన్న విద్యార్థులకు స్వామివారి ప్రత్యేక దర్శనం, ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు.

నూతన రథంపై ప్రాకార సేవ



అన్నవరం, ఫిబ్రవరి 22: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి గురువారం నూతన రథంపై ప్రాకార సేవ నిర్వహించారు. పర్వదినాలలో స్వామివారికి వెండిరథంపై ఊరేగింపు నిర్వహించేవారు. ఆ రథం పాతదై పోవడంతో ముందు జాగ్రత్త చర్యగా పూర్వపు ఈవో ఆజాద్ రూ.38 లక్షల వ్యయంతో టేకు రథం చేయించాలని ప్రతిపాదించి పనులు ప్రారంభించారు. రథం తయారీ పూర్తికావడంతో గురువారం ఈవో రామచంద్రమోహన్ దంపతులు రథాన్ని ప్రారంభించారు. అనంతరం రథంపై స్వామి,అమ్మవార్లు ఆలయ ప్రాకారం చుట్టూ విహరించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, చామర్తి కన్నబాబు, ఇంద్రగంటి సుధీర్, పాలంకి పట్టాభి ముత్య వెంకట్రావు, పాలక మండలి సభ్యులు పేరూరి బద్రీనారాయణ పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు



కుమారి(ఫైల్)



ఆలమూరు, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్లలో వివాహిత సలాది మరియకుమారి (30) హత్యకు గురైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...చొప్పెల్ల గ్రామంలో నివాసముంటున్న సలాది మరియకుమారి, బిక్కవోలు మండలం మెళ్లూరుకు చెందిన అవివాహితుడైన చల్లా దుర్గానాగప్రసన్నకుమార్ మధ్య రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉంది. మరియకుమారికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రసన్నకుమార్ తన అక్క, బావలకు చెందిన ఇటుక బట్టీ నిర్వహిస్తున్నారు. అందులో కుమారి భర్త సలాది శివసూర్యనారాయణ కూలీగా పనిచేస్తున్నాడు. దీంతో వారిద్దరి మధ్య సంబంధం కొనసాగుతోందని భర్త పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల మరియకుమారి మరొకరితో చనువుగా ఉంటోంది. ఈ విషయమై కొద్ది రోజులుగా వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం ప్రసన్నకుమార్ మరియకుమారిని బలంగా కొట్టి చంపేసినట్టు భావిస్తున్నారు. కొద్దిసేపటి తర్వాత మరియకుమారి ఉరేసుకుని చనిపోయిందంటూ ప్రసన్నకుమార్ కొందరిని తీసుకెళ్లి చూపించినట్టు చెప్తున్నారు. కోపంతో బలంగా కొట్టడంతో కిందపడి చనిపోయిందని ప్రసన్నకుమార్ తమ విచారణలో చెప్పా డని రూరల్ సీఐ రామ్‌కుమార్ తెలిపారు. నిందితుడు ఆలమూరు తహసీల్దారు గోపాలకృష్ణ ఎదుట లొంగి పోయాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ చెప్పారు.

జనసేన పార్టీకే నా సపోర్టు

కుటుంబీకులు ఆదేశిస్తే బాబాయి తరపున ప్రచారం

ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో సినీ హీరో వరుణ్‌తేజ్



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 : 'బాబాయి పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ద్వారా నిజాయితీగా రాజకీయాలు చేస్తున్నారు. ఆయన చేస్తున్న పోరాటంపై మాకు నమ్మకం ఉంది. నా సపోర్టు జనసేన పార్టీకే ఉంటుంది' అని సినీ హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ సినిమా ప్రమోషన్‌లో భాగంగా గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విచ్చేసి మీడియాతో మాట్లాడారు. రాజకీయాలపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిస్తూ తన కుటుంబ సభ్యులు అనుమతిస్తే వచ్చే ఎన్నికల్లో బాబాయి పవన్ కల్యాణ్ తరపున జనసేన పార్టీ కోసం ఎన్నికల్లో ప్రచారం చేస్తానని వెల్లడించారు. పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆయన ఎంచుకునే మార్గాలపై నమ్మకం ఉందని స్పష్టం చేశారు. బాబాయితో కలసి నటించడం ఇష్టమే అయినా ప్రస్తుతం అలాంటి కథలేవీ లేవన్నారు. పుల్వామా ఘటనల నేపథ్యంలో దర్శకుడు సినిమాను తెరకెక్కించారని, మార్చి 1 సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు.

రేపటి నుంచి అంతర్ జిల్లాల ఖోఖో పోటీలు

సామర్లకోట జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లు



క్రీడా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

సామర్లకోట, ఫిబ్రవరి 22: సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 24 నుంచి 26 వరకూ మూడు రోజుల పాటు 56వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సీనియర్స్ ఖో-ఖో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఖోఖో సంఘం కార్యదర్శి, పోటీల నిర్వాహణ కార్యదర్శి కె. పట్టాభిరామం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాన్ మోజెస్‌తో కలిసి గురువారం సాయంత్రం కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టాభిరామం మాట్లాడుతూ మూడు రోజుల పాటు సీనియర్స్ పురుషులు, మహిళల విభాగాల్లో డే అండ్ నైట్ ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. రాష్ట్రంలో 13 జిల్లాల క్రీడాకారులతో పాటు ఏపీ ఉద్యోగ సంఘం కూడా పోటీలలో పాల్గొంటోందన్నారు. ఈ పోటీలలో అత్యంత ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర పురుషుల, మహిళల జట్లకు ఎంపిక చేసి ఆంధ్ర రాష్ట్రం తరపున మార్చి 27 నుంచి ఏప్రిల్ 2 వరకూ న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కళాశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్నామని జాన్‌మోజెస్ తెలిపారు. పాలిక చంటి, కెన్నడీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సాక్షిగా వైసీపీ నాయకుల ఘర్షణ

కడియం, ఫిబ్రవరి 22: సాక్షాత్తు మంత్రి సమక్షంలో వైసీపీ నాయకులు బాహాబాహీకి దిగారు. కడియం ఉన్నత పాఠశాలలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. మంత్రి వేణుగోపాలకృష్ణ వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. అయితే ఫొటోలు తీసే సమయంలో ముందుండాలనే విషయంపై మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ ఈలి గోపాలం, వైసీపీ జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తిలకు మధ్య వాగ్వాదం జరిగింది. మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు సమక్షంలో ఘర్షణకు దిగారు. ఈ సంఘటనతో మంత్రి వేణు కొంత అసహనానికి గురయ్యారు. ఇద్దరినీ విడదీసే ప్రయత్నం చేసినా వారు లెక్కచేయక పోవడంతో అక్కడే ఉన్న పోలీసులు గొడవ పెరగడకుండా చూశారు. కాగా కొంతకాలం నుంచి చక్రవర్తి, గోపాలం మధ్య విభేదాలున్నాయి.

25న ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో 2వ వార్డు కౌన్సిలర్ ఆశెట్టి నాగదుర్గ-ఆదిబాబు దంపతుల నేతృత్వంలో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పవర్‌లిఫ్టింగ్, బెంచ్‌ప్రెస్-2024 పోటీలను ఈ నెల 25న నిర్వహిస్తున్నట్టు జిమ్ కోచ్ కంకిపాటి.వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో ట్రోఫీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, ప్రధాన కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు గురువారం ఆవిష్కరించారు. కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో జరిగే పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఇప్పటికే వంద మందికిపైగా క్రీడాకారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి, సభ్యులు దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి వెంకటసముద్రం, చిక్కం రాజబాబు, పొణకల దుర్గాప్రసాద్, నార్ని శ్రీను, చీకురుమెల్లి కిరణ్‌కుమార్, సంసాని సోమశేఖర్, కరాటం రవిసుధీర్ పాల్గొన్నారు.

ఆక్వా చెరువుల వద్ద మోటార్ల చోరీ

అల్లవరం, ఫిబ్రవరి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని డి.రావులపాలెం, తాడికోన, కొమరగిరిపట్నం గ్రామాల్లో ఆక్వా చెరువుల వద్ద మోటార్ల ఇంజన్లు దొంగలపాలయ్యాయి. డి.రావులపాలెంలో మోటార్ ఇంజన్‌ను అపహరిస్తున్న దొంగను రైతు బొబ్బిలి శ్రీను పట్టుకుని పోలీసులకు అప్పగించినట్టు సమాచారం. డి.రావులపాలెంలో తన చెరువు వద్ద మోటారు ఇంజన్ చోరీకి గురైందని తిక్కా శ్రీరామమూర్తి అల్లవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గడిచిన ఏడాది కాలంలో అల్లవరం మండలంలో సుమారు 70కిపైగా మోటార్ ఇంజన్లు దొంగతనాలకు గురయ్యాయి. దొంగతనాలకు పాల్పడుతున్న వారిని, వాటిని కొనుగోలు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని బాధితులు కోరుతున్నారు.

అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి నిరసన

కలెక్టరేట్‌లో బైఠాయింపు



నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22: తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారుల తీరును నిరసిస్తూ అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మాధవీలతను కలిసి అనపర్తి నియోజకవర్గం పరిధిలో జరుగుతున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు గురువారం కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే కలెక్టర్, జేసీ, డీఆర్‌వో అందుబాటులో లేకపోయినా చాంబర్ చాంబర్‌కు తిప్పడంతో అధికారుల తీరుపై మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అనేక చోట్ల అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేయడానికి జిల్లా కలెక్టరేట్‌కు మధ్యాహ్నం వచ్చామన్నారు. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ ఆఫీస్‌లో ఉన్నారని చెప్పడంతో జాయింట్ కలెక్టర్ కోసం చూశామన్నారు. అయితే ఆయన ట్రైనింగ్‌లో ఉన్నారని చెప్పారన్నారు దీంతో డీఆర్‌వో కోసం చూస్తే అక్కడ ఆయన కార్యాలయానికి తాళం వేసి ఉందన్నారు. ఇలా 45 నిమిషాల పాటు అన్ని చాంబర్లు తిరిగినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. దీంతో అధికారుల తీరుకు బైఠాయించి నిరసన తెలిపామన్నారు. అప్పుడు ఒక అధికారి వచ్చి వినతి తీసుకున్నారన్నారు. బదిలీ అయ్యివెళ్ళిన పోసిబాబు అనే తహశీల్దార్ తిరిగి అనపర్తి వచ్చి డమ్మీ పట్టాలపై సంతకం చేయడం, అలాగే జరగని భూసేకరణ జరిగినట్టు చెబుతూ గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది రెవెన్యూ అధికారులు కలిసి డమ్మీ పట్టాలు పంపిణీ చేయడంపై ఫిర్యాదు చేయడానికి వస్తే ఇక్కడ పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా జట్లలోని విద్యార్థులు

సెపక్‌తక్రా రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: నెల్లూరు జిల్లా ముత్తుకూరులో శనివారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల సెపక్‌తక్రా చాంపియన్‌షిప్-2024 పోటీలకు కోనసీమ జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు కోచ్‌లు యాండ్ర గౌతమ్, కేతా సతీష్ తెలిపారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం అసోసియేషన్ జిల్లా ప్రతినిధి మునగాల మన్యం, జిల్లా సంయుక్త కార్యదర్శి లంక జార్జ్, ఎస్వీవీజీ ప్రకాష్ ఆధ్వర్యంలో క్రీడా జట్ల ఎంపిక నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో సబ్ జూనియర్స్‌లో సీహెచ్ శశిధర్‌నాగ్, జి.సందీప్, ఎ.యశ్వంత్, జి.అద్విత్, పి.రోహిత్‌సాయిఫణీంద్ర, జూనియర్స్‌లో ఎం.దుర్గాచందు, కె.జగదీష్, ఎ.పవన్, అఖిలేష్, షణ్ముఖశ్రీహరిలను ఎంపిక చేశారు. వారిని ఏఆర్ డీఎస్పీ విజయసారథి, ఫిజికల్ డైరెక్టర్ కేఎన్ ప్రసాద్ అభినందించారు. టీమ్ కోచ్‌లుగా సీహెచ్ మోహనకృష్ణ, మట్టపర్తి మురళీకృష్ణ, మేనేజరుగా జీవీ బాబు వ్యవహరిస్తారని యాండ్ర గౌతమ్ తెలిపారు.

రేపటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు



ముమ్మిడివరం, ఫిబ్రవరి 22: మండలంలోని సీహెచ్ గున్నేపల్లిలో శ్రీసత్తెమ్మ తల్లి అమ్మవారి 50వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్లను ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఆవిష్కరించారు. మహిపాలచెరువు-పల్లంకుర్రు రోడ్డులో వివిధ దేవతామూర్తుల ఆకృతులను విద్యుద్దీపాలతో అలంకరించి భారీ స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా 24న అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరుపుతారు. 25న చైతన్యనందా చినస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం, 26న గణపతి పూజ, మహాకుంభాభిషేకం, చండీ హోమం, రుద్ర హోమం, కుంకుమ పూజ చేస్తారు. 27న ప్రత్యేక డ్యాన్సు ప్రోగ్రాం, 28న మిమిక్రీ, ప్రత్యేక డ్యాన్సు ప్రోగ్రాం, 29న సంగీత విభావరి, మార్చి 1న సంగీత విభావరి, 2న సత్తెమ్మతల్లి అమ్మవారి కథ, భారీ బాణసంచా కాల్పులు, 3న భజాభజంత్రీలు, గరగ నృత్యాలు, బ్యాండుమేళాలు, బాణసంచా కాల్పులు, మూడువేల మంది కళాకారులతో అమ్మవారి ఊరేగింపు, భారీ అన్నసమారాధన జరుగుతాయి.

రేపు అంతర్వేదికి ప్రత్యేక బస్సులు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం జరిగే చక్రస్నానానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్టీసీ అమలాపురం డిపో మేనేజరు సీహెచ్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ప్రతి అర గంటకు ప్రత్యేక బస్సులు తిరుగుతాయన్నారు.

జనసేనలో చేరిక

అంబాజీపేట, ఫిబ్రవరి 22: మండలంలోని ఇరుసుమండలో జనసేన నాయకుడు సుంకర రామదాసునాయుడు ఆధ్వర్యంలో 50 మంది వివిధ పార్టీలకు రాజీనామా చేసి జనసేనలో చేరారు. వారికి ఆ పార్టీ పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి సత్యనారాయణ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, అక్కిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, ప్రసాద్, సుంకర నాయుడు, అరిగెల సూరిబాబు, మట్టపర్తి సోమేశ్వరరావు, మైపాల తాతాజీ, ములపర్తి రమేష్, టీడీపీ నాయకులు చిన్నం బాలవిజయరావు, నేదునూరి వెంకటరమణబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మ ఆలయం ప్రారంభం



పి.గన్నవరం, ఫిబ్రవరి 22: ముంగండలో శిథిలావస్థకు చేరిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాన్ని గ్రామస్తులు, భక్తుల విరాళాలు రూ.కోటితో సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేస్తారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రెడ్‌క్రాస్ సాయం

అంబాజీపేట, ఫిబ్రవరి 22: పుల్లేటికుర్రు పరిధిలోని వ్యాఘ్రేశ్వరానికి చెందిన గుబ్బల వెంకటరమణ, గుబ్బల రామకృష్ణ తాటాకిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఆహుతైంది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ చైర్మన్ కొరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో సమకూర్చిన వంట సామగ్రి, టార్పాలిన్, బియ్యం, దుస్తులను బాధితులకు తహసీల్దారు జె.విమలకుమారి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ కుసుమ వెంకటేష్, ఆర్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత ఆర్థిక సాయం

అల్లవరం, ఫిబ్రవరి 22: మండలంలోని కోడూరుపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న జనసేన ఉపాధ్యక్షుడు నూటుకుర్తి కల్యాణ్ భార్య మౌనికకు ఆ పార్టీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. నాయకులు పిల్లా ప్రసాద్, మేడిద శంకరరావు, కంకిపాటి వీరబాబు, శిరంగు సత్యనారాయణ, రుద్రరాజు చిట్టిబాబు, కటికిరెడ్డి బాబి, వంగ దొరయ్యనాయుడు, కాకిలేటి హరికృష్ణ, తిక్కా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత శ్రీనివాస్‌కు నివాళులు

కొత్తపేట, ఫిబ్రవరి 22: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి పాలూరి శ్రీనివాసరావు సంతాప నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన సోదరుడు సత్యానందం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాయకులు తొగరు సీతారామాంజనేయులు, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, శేషగిరి, గొలకోటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	సుందరం మాస్టర్
వెంకటరమణ	ఈగల్
శ్రీలలిత	సిద్ధార్థరాయ్
శేఖర్ స్క్రీన్-1	హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	ముఖ్య గమనిక
రమా	గుంటూరు కారం
గణపతి	అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	యాత్ర-2

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.1.61 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,61,894 లభించినట్టు ఈవో బి.కిషోర్‌కుమార్ తెలిపారు.





కొత్తపేట మండలంలో భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలను వివరిస్తున్న సత్యానందరావు, మండపేటలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలి: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మాట తప్పను... మడమ తిప్పను... ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అన్ని హామీలూ విస్మరించారని ఆయన ధ్వజమెత్తారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. సామాన్యులకు, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందన్నారు బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పట్టణంలోని 16,17,18 వార్డుల్లో పర్యటించారు. టీడీపీ, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఉమ్మడి అజెండాను ప్రజలకు వివరించారు. 'జయహో బీసీ' సభలో బీసీలకు టీడీపీ అమలు చేసిన పథకాలను బీసీ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు చింతపల్లి రామకృష్ణ, మైనార్టీ సెల్ నాయకుడు షేక్ ఇబ్రహీం వివరించారు. బీసీలను గుర్తించిన పార్టీ టీడీపీయేనని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించి వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, కౌన్సిలర్లు కాళ్లకూరి స్వరాజ్యభవానిశ్రీనివాస్, యరమాటి గంగరాజు, వార్డు ఇన్‌చార్జిలు గనిశెట్టి బాబి, సంకు శివన్నారాయణ, టీడీపీ శ్రేణులు, వేగుళ్ల ఓంతేజ, ఉంగరాల రాంబాబు, వాకచర్ల గుప్తా, వల్లిజానీ, మాజీ కౌన్సిలర్ వల్లూరి ఇందిరారాణి, చింతల శ్రీను, బొడ్డు రామకృష్ణ, మల్లిపూడి గణేశ్వరరావు, గ్రంధి సత్తిరాజు, తెల్లకుల వేణుగోపాల్, మచ్చా నాగు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీలో అన్నీ అవకతవకలే: బండారు

కొత్తపేట, ఫిబ్రవరి 22: శివారు గ్రామాల్లో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థల పట్టాల్లో ఎన్నో అవకతవకలు చోటుచేసుకున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆరోపించారు. గురువారం పలివెలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ పేదలకు మొదట్లో రెండు సెంట్లు పట్టా అని చెప్పి తర్వాత సెంటున్నరకు మార్చారన్నారు. నివాస యోగ్యం కాని స్థలాలు కేటాయించి చేతులు దులుపుకున్నారన్నారు. అవి ఎక్కడ ఉన్నాయో కూడా తెలియకుండా మోసం చేసి ప్రచార ఆర్భాటం చేస్తున్నారన్నారు. పలివెలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యల్లమిల్లి జగన్మోహన్, సాదే లక్ష్మీశ్రీనివాస్, గొలకోటి శ్రీను, నల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావం యాత్ర

అమలాపురం టౌన్: పట్టణంలోని 8వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ ఎన్నికల శంఖారావం యాత్రను టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టా మహాలక్ష్మిప్రభాకర్, బొర్రా ఈశ్వరరావు, బడుగు సత్యనారాయణ, నల్లా స్వామి, మంద గెద్దయ్య, రాజులపూడి భీముడు, మాకిరెడ్డి పూర్ణిమ, భాస్కర్ల రామకృష్ణ, పిచ్చిక శ్యామ్, వలవల శివరావు, ఆశెట్టి ఆదిబాబు, కాశిన బాబి, బత్తుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చాలెంజింగ్, టెండరు ఓట్లపై అవగాహన కల్పించాలి



రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు హుస్సేన్

పి.గన్నవరం, ఫిబ్రవరి 22: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చాలెంజింగ్, టెండరు ఓట్లపై ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ముందుగానే అవగాహన కల్పించాలని తహసీల్దారు కార్యాలయంలో జరిగిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు తహసీల్దారు షేక్ హుస్సేన్‌ను కోరారు. పోలింగ్ జరిగే సమయంలో ఈవీఎం వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. తహసీల్దారు హుస్సేన్ మాట్లాడుతూ ఏ సమయంలోనైనా నోటిఫికేషన్ రావచ్చని, ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. కొంతమంది ఓటు ఉన్నప్పటికీ ఓటు కోసం మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. అటువంటి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఓటు తొలగిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 11చోట్ల వివిధ కారణాలతో బీఎల్‌వోలను మార్పు చేశామని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు బి.గోపాలకృష్ణ, రాజకీయ పార్టీల నాయకులు తోలేటి సత్తిబాబు, చిట్టాల రామజోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం బాలాజీ కాన్వెంట్‌లో కవలలు

కవలల దినోత్సవం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 22: ముమ్మిడివరంలోని శ్రీబాలాజీ కాన్వెంట్‌లో వ్యవస్థాపకుడు పీవీఎస్ శాస్త్రి, కరస్పాండెంట్ పి.సుజాత ఆధ్వర్యంలో కవలల దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ చదువుతున్న కవల విద్యార్థులకు వారితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలమూరు: స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ఆరో తరగతిలో ఒక జంట, 7, 9 తరగతుల్లో రెండేసి జంటలు వున్నారు. వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. అంతేగాక మరో నలుగురు కవలల్లో బాలికలు ఇక్కడ చదువుతుండగా అబ్బాయిలు మరో చోట చదువుతున్నారు.



రామచంద్రపురం: మోడరన్ విద్యా సంస్థల్లో అధినేత లయన్ జీవీ రావు ఆధ్వర్యంలో కవలల దినోత్సవం నిర్వహించారు. కవల విద్యార్థులను హైస్కూలు డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, హెడ్ మాస్టర్ ఎం.చిట్టిబాబు, ప్రిన్సిపల్ సీహెచ్ రాజేష్ అభినందించారు.



ఆలమూరు బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో కవలలు

భారతీయ కళలపై పుస్తకావిష్కరణ

కె.గంగవరం, ఫిబ్రవరి 22: భారతీయ కళలపై అవగాహన కల్పిస్తూ కె.గంగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుని వాడ్రేవు సువర్చల పుస్తకాన్ని రాశారు. దీనిని గురువారం ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పుస్తక రచనలో తనకు ఆమలదాసు ఫణికృష్ణ, గోపి, ఏడుకొండలు సూచనలు చేశారని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమరాజు, బ్రహ్మానందం, శ్రీనివాసు, లక్ష్మి, రామలక్ష్మి, రాఘవకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు మండల అధ్యక్షుడిగా తాతాజీ



మామిడికుదురు, ఫిబ్రవరి 22: కాపునాడు మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడిగా పెదపట్నంలంక గ్రామానికి చెందిన గుండాబత్తుల శ్రీనుగోవిందరావు (తాతాజీ) నియమితులయ్యారు. ఈ మేరకు కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్‌ద్వారా నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు తాతాజీ తెలిపారు.

వైసీపీ పంచాయతీరాజ్ విభాగం

రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా బంగారునాయుడు

పి.గన్నవరం, ఫిబ్రవరి 22: వైసీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగాకె.ఏనుగుపల్లి సర్పంచ్ తోలేటి బంగారునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

'మాదిగల రావులపాలెం సమావేశానికి తరలిరండి'

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 22: రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాదిగల సమావేశానికి అధిక సంఖ్యలో మాదిగలు తరలి వెళ్లాలని దండోరా సమావేశం విజ్ఞప్తి చేసింది. ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన నంగవరంలో గురువారం సమావేశం నిర్వహించారు. పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి, వేపాటి సురేష్, వంగలపూడి సత్యనారాయణ, దార్ల రమణ, వంగలపూడి కుమార్‌రాజా, సవరపు నందు, సత్తాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో సర్పంచ్, వైస్ ఎంపీపీ వాగ్వాదం

వైసీపీలో బయటపడ్డ విభేదాలు

ఎమ్మెల్యే ఎదుట సర్పంచ్, వైస్ ఎంపీపీ వాగ్వివాదం

ఫ్లెక్సీలో ఫొటో లేకపోవడంపై వైస్ ఎంపీపీ ఆగ్రహం

అంబాజీపేట, ఫిబ్రవరి 22: వైసీపీ శ్రేణుల్లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బయటపడ్డాయి. ఒకరినొకరు దూషించుకుంటూ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఎదుటే తీవ్ర వాగ్వివాదానికి దిగారు. చిరతపూడి సచివాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సర్పంచ్ కోట బేబీరాణి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు వేయలేదని నాగరాజు సర్పంచ్‌ను ప్రశ్నించాడు. దీంతో వారిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. వారిని వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు వారించారు. అయినప్పటికీ ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. మహిళా సర్పంచ్ అయిన తనకు ఏ కార్యక్రమంలోనూ విలువ ఇవ్వట్లేదని వైస్ ఎంపీపీ నాగరాజుపై ఎమ్మెల్యేకు సర్పంచ్ ఫిర్యాదు చేశారు. అక్కడ పరిస్థితిని చూసిన ఎమ్మెల్యే చిట్టిబాబు సర్దుబాటు చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.

'తెలుగు భాషా చరిత్ర' పుస్తకం బహూకరణ

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 22: భీమనపల్లిలోని శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పీఎఫ్ విశ్రాంత సహాయ కమిషనరు అద్దంకి అమరేశ్వరరావు తెలుగు భాషా చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. గురువారం పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. తెలుగు సాహిత్యం సౌందర్యాన్ని అమరేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. తెలుగు బోధనలో ఉపాధ్యాయులు ఎవరికి వారు ప్రత్యేక శైలి ఏర్పాటు చేసుకోవాలని ప్రముఖ సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి సూచించారు. కె.విశ్వనాథ్ సేవా పురస్కార గ్రహీత అమరేశ్వరరావు, రాష్ట్ర సాహిత్య అకాడమీ నగదు పురస్కార గ్రహీత నల్లా నరసింహమూర్తిని హెచ్ఎం నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యార్థులకు కవితలు, వ్యాసరచన, పద్యరచన, కథా రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అంతర్వేది తీర్థంలో స్కౌట్ విద్యార్థుల సేవ

అంతర్వేది: ప్రపంచ స్కౌట్స్, గైడ్స్ దినోత్సవం సందర్భంగాగురువారం బెడెన్ పవెల్ జయంతి నిర్వహించి స్కౌట్ విద్యార్థులందరూ సమావేశమయ్యారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో సేవలందిస్తూ ఆలయ ప్రాంగణంలో స్కౌట్ పతాకాన్ని ఎంపీపీ వీరా మల్లిబాబు ఆవిష్కరించారు. స్కౌట్ మాస్టర్ కె.కృష్ణప్రసాద్, వి.సుబ్రహ్మణ్యం, కె.బాలాజీ, కె.భాస్కర్, పి.జయరామ్, కె.సతీష్‌కుమార్, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

'దళితులు సమైక్యంగా ఉండాలి'

మలికిపురం, ఫిబ్రవరి 22: దళితులంతా సమైక్యంగా ఉండాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కోరారు. గురువారం మలికిపురంలో ప్రముఖ దళిత నాయకుడు కొల్లాబత్తుల కుమార్ ఇంటి వద్ద నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోనిపాటి రాజు అధ్యక్షతన జరిగిన టీడీపీ దళితుల ఆత్మీయుల సదస్సుకు సూర్యారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొల్లాబత్తుల కుమార్, దోనిపాటి రాజు, గెడ్డం సింహ, బందెల పద్మ, కాండ్రేగుల భవానీలావణ్య, రాపాక నవరత్నం, తాడి సత్యనారాయణ, రావి ధర్మరాజు, రాపాక ఆనంద్‌కుమార్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, జంపన సత్యనారాయణరాజు, పిండి సత్యనారాయణ, రుద్రరాజు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రాయవరం, ఫిబ్రవరి 22: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం చెల్లూరు, మాచవరం, లొల్ల గ్రామాల్లో ఓటు హక్కు ప్రాధాన్యత, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగంలపై అవగాహన కల్పించారు. డీఎస్పీ వెంట మండపేట రూరల్ సీఐ, రాయవరం ఎస్ఐ జి.నరేష్ వున్నారు.

నేడు పెద్దింట్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవం

రావులపాలెం, ఫిబ్రవరి 22: రావులపాలెంలోని భద్రమహంకాళమ్మ పుంత రోడ్డులో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి ఐదో వార్షిక మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. రెండేళ్లకు ఒకసారి మాత్రమే ఈ ఉత్సవం జరుగుతుందని వారు చెప్పారు.

నేత్రపర్వంగా పూజలు

రావులపాలెం, ఫిబ్రవరి 22: స్థానిక ముసలి రామాలయం ప్రాంగణంలోని శ్రీసీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు వైభవంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లు పూర్ణాలంకరణలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఫిబ్రవరి 22: కాట్రేనికోన విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. కాట్రేనికోన, వేట్లపాలెం, జీకే పోర, చిర్రయానాం, గెద్దనపల్లి, నడవపల్లి, కుండలేశ్వరం, దొంతికుర్రు, కొప్పిగుంట, పండి, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, మొల్లేటిమొగ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అంబాజీపేట: అంబాజీపేట, గంగలకుర్రు, ముక్కామల విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు.



ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు, ఫిబ్రవరి 22: మండలంలోని మూలస్థానం అగ్రహారంలో సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు 108 బిందెలతో గోదావరి జలాలను మేళతాళాలతో భారీ ఊరేగింపుగా తీసుకొచ్చారు. గోదావరి జలాలతో పాటు 40 రకాల పళ్ల రసాలతో బాబాకు అభిషేకాలు చేశారు. టన్నున్నర పూలతో పుష్పాభిషేకం జరిపించారు. ఆలమూరు, కడియం, రావులపాలెం మండలాలతో పాటు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

పొల్లమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠ



మామిడికుదురు, ఫిబ్రవరి 22: ఈదరాడ గ్రామ దేవతపొల్లమ్మ అమ్మవారి ఆలయ పునః ప్రతిష్ఠ గురువారం అట్టహాసంగా జరిగింది. వేదమంత్రాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పుల నడుమ శిలావిగ్రహ మహా సంప్రోక్షణ, నూతన ఆలయ శిఖర ముఖమండపం ప్రతిష్ఠ చేశారు. సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన క్రతువులో పలువురు దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటి హరీష్‌మాధుర్, వాసంశెట్టి సుభాష్, గంధం పల్లంరాజు, డాక్టర్ సత్యసంజీవ్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, చాట్ల సత్యనారాయణ, యెరుబండి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

భారత్ బ్రాండ్ రైస్ విక్రయాలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 22: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన భారత్ బ్రాండ్ రైస్ విక్రయాలను అమలాపురం యర్రమిల్లివారి వీధిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా ప్రారంభించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి నాగవెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, కంచిపల్లి అబ్బులు, దూరి రాజేష్, కొండేటి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ, అరిగెల తేజ తదితరులు పాల్గొన్నారు.

5,289 మంది మత్స్యకారులకు పరిహారం

యానాం, ఫిబ్రవరి 22: యానాం నియోజకవర్గ పరిధిలోని 5,462 మందిలో 5,289 మందికి ఓఎన్జీసీ పరిహారం విడుదల చేసేందుకు పుదుచ్చేరి గవర్నర్‌తో పాటు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. వీరిలో 173 మంది కార్మిక శాఖలో దీపావళి కూపన్లు తీసుకోవడంతో వారి పేర్లను జాబితా నుంచి తొలగించారన్నారు. అయినా మరో మారు విచారణ నిర్వహించి రెండో విడత ఇచ్చేలా కోరినట్టు మల్లాడి తెలిపారు.

నవోదయలో థింకింగ్ డే

యానాం, ఫిబ్రవరి 22: భారత్ స్కౌట్, గైడ్స్ వ్యవస్థాపకుడు సర్ రాబర్ట్ బెడెన్ పావెల్ జయంతి సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయలో థింకింగ్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు స్కౌట్ పతాకాన్ని ఎగురవేసి పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్కౌట్ మాస్టర్ డి.పాపారావు ఆధ్వర్యంలో స్కౌట్, గైడ్స్ విద్యార్థులు ఆలపించిన గీతాలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేగం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయల్ క్లబ్ లైసెన్సు రెన్యువల్ సస్పెండ్

యానాం, ఫిబ్రవరి 22: రాయల్ రిక్రియేషన్ క్లబ్ లైసెన్సు రెన్యువల్‌ను సస్పెండ్ చేస్తూ యానాం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఉత్తర్వులను క్లబ్ ప్రతినిధులకు అందజేశారు. వారంలో సమాధానం ఇవ్వకపోతే లైసెన్సు రద్దు చేస్తామని చెప్పారు.